ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
గురువారం 4 డిసెంబరు 2025

రాజభవన్.. ఇక లోకభవన్

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తీర్మానానికి అనుగుణంగా దేశవ్యాప్తంగా ఉండే రాజభవనాలకు లోకభవన్‌లుగా పేర్లు మారుస్తూ ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినిరజనీష్‌కు బుధవారం రాజభవన్ ప్రత్యేక కార్యదర్శి ఆర్ ప్రభుశంకర్ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఆమోదించినట్లు లేఖలో పేర్కొన్నారు. రానున్న రోజులో ప్రభుత్వం అన్నిశాఖలు, ప్రభుత్వ ఆదేశాలు, అధికారిక వ్యవహారాలు, వెబ్‌సైట్‌లు బోర్డులను లోకభవన్‌గా నమోదు చేయాలన్నారు.

అనుచరుల హంగామా

- మంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో సీఎం, డీసీఎం అభిమానుల సందడి
- డీకే సీఎం కావాలంటూ నినాదాలు
- సిద్ధూనే కొనసాగాలని కేకలు
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమక్షంలోనే వాగ్వాదం


వేణుగోపాల్ ముందే సీఎం, డీసీఎం అనుచరుల తోపులాట

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయకత్వ మార్పు అనే అంశం తారస్థాయికి చేరింది. సీఎం, డీసీఎంలు మేం అన్నదమ్ముల లాంటివారమని, కలిసే ఉంటామని ఎంతగా చెప్పుకొంటున్నా వారి అనుచరులు మాత్రం ఏం జరుగుతుందోననే ఉత్కంఠలోనే ఉన్నారు. మంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లోనే బుధవారం హంగామా సాగింది. మంగళూరులో శివగిరి మఠ వర్కల నారాయణగురు అధ్యయనపీఠంలో జరిగే కార్యక్రమానికి సీఎం సిద్దరామయ్య వెళ్లారు. ఇదే సభలో పాల్గొనేందుకు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా హాజరయ్యారు. దీంతో పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతించేందుకు వచ్చారు. ఇదే సందర్భంలోనే డీకే శివకుమార్ సీఎం కావాలంటూ కొందరు నినాదాలు చేశారు. అంతలోనే సిద్దరామయ్య సీఎంగా ఐదేళ్లు కొనసాగాలంటూ మరోవర్గం కేకలు వేశారు. ఒక్కసారిగా ఈ వాతావరణం ఎయిర్‌పోర్ట్‌లో గందరగోళానికి కారణమైంది. ఇటు సీఎం ఎవరినీ కట్టడి చేయలేకపోయారు. మరోవైపు కేసీ వేణుగోపాల్ పరిస్థితి కూడా అలాగే మారింది. అక్కడనుంచి కావేరి అతిథిగృహానికి వెళ్లి కేసీ వేణుగోపాల్, సీఎం కాసేపు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత కోనాజెలోని మంగళగంగోత్రిలో నారాయణగురు అధ్యయనపీఠం, మంగళూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన శతమానద ప్రస్థాన నారాయణగురు, మహాత్మా గాంధీ చారిత్రాత్మకం అనే అంశాలపై చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. నారాయణగురు మహాసమాధి శతాబ్ది సర్వమత సమ్మేళనం జరిగింది. కోనాజెలో క్లాక్‌టవర్‌ను ప్రారంభించారు. ఈ సభలోను కేసీ వేణుగోపాల్, సీఎం సిద్దరామయ్య వేదిక పంచుకున్నారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ కేసీ వేణుగోపాల్‌తో ఎటువంటి రాజకీయ చర్చ జరపలేదని స్పష్టం చేశారు. సాయంత్రం పేస్ ఏఐ ఉన్నత అధ్యయన కేంద్రానికి సీఎం భూమిపూజ చేశారు. పేస్ గ్రూప్ సంస్థ ఫౌండర్ డాక్టర్ పీఏ ఇబ్రహీం దూరదృష్టితోనే వేలాదిమందికి గుణాత్మకమైన విద్య సాధ్యమైందన్నారు. ఇప్పటివరకు పేస్ ద్వారా 36వేలమంది అభ్యసించినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్ యూటీ ఖాదర్, మంత్రులు దినేశ్‌గుండూరావు, లక్ష్మీహెబ్బాళ్కర్, జమీర్ అహ్మద్, పరమేశ్వర్, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ పాల్గొన్నారు.


నారాయణగురు శతాబ్ది సర్వమత సమ్మేళనంలో సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు

ఢిల్లీ వెళ్లినా... నేతలతో భేటీ లేదు

- మీడియాతో డీసీఎం డీకే శివకుమార్



బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశం కొంతమేర సద్దుమణిగినట్లయింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ రెండు బ్రేక్‌ఫాస్ట్ భేటీలు అయ్యారు. బుధవారం ఢిల్లీలో డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. అగ్రనేతలను కలిసే ఆలోచన లేదన్నారు. తన స్నేహితుడి కుమారుడి పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చానన్నారు. ఈనెల 14న ఓటు చౌర్యం ర్యాలీకి సంబంధించిన అంశాలపై మాట్లాడాల్సి ఉందన్నారు. కర్ణాటక నుంచి 10వేల మందిని తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో కలిసి చర్చించాల్సి ఉందన్నారు. ఈ బాధ్యతలు తనకు ముఖ్యమన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు క్యాబినెట్ భేటీ ఉన్నందున త్వరగా బయల్దేరుతానన్నారు. అగ్రనేతలు పార్లమెంటు సమావేశాల్లో బిజీగా ఉన్నందున తాను ఎవరినీ కలిసే ఆలోచనలో లేనన్నారు. వారిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదన్నారు. కాగా సీఎం సిద్దరామయ్య మంగళూరులో నారాయణగురు శతజయంతి కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కలిసి వేదిక పంచుకున్నారు. విమానాశ్రయంలో ఇద్దరూ దాదాపు ఒకే సమయానికి వచ్చినపుడు సీఎం, డీసీఎం తరపున అభిమానులు నినాదాలు చేశారు. డీకే శివకుమార్ సీఎం కావాలని కొందరు, సిద్దరామయ్య ఐదేళ్లు సీఎంగా ఉండాలని మరికొందరు నినాదాలు చేశారు. మంగళూరులో సీఎం మాట్లాడుతూ... డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్లకూడదని ఎవరు చెబుతారన్నారు. తనకు ఆహ్వానం వచ్చినపుడు మాత్రమే ఢిల్లీ వెళ్తానన్నారు. కేసీ వేణుగోపాల్‌తో ఎటువంటి రాజకీయ అంశాలు చర్చించలేదన్నారు.

అంజనాద్రి

- భక్తులతో కిటకిటలాడిన హనుమంతుడి జన్మస్థలం అంజనాద్రి
- మాల విసర్జనకు భారీగా విచ్చేసిన భక్తులు


మాలధారులతో కిక్కిరిసిన అంజనాద్రి బెట్ట


అలంకరణలో ఆంజనేయస్వామి

బళ్లారి గాంధీనగర్/హోస్పేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంజనాద్రి పర్వతం హనుమాన్ మాలధారులతో కిటకిటలాడింది. బుధవారం మాల విసర్జన సందర్భంగా భారీగా మాలధారులు, భక్తులు కొండకు చేరుకున్నారు. చలిని కూడా లెక్కచేయకుండా వేలాది మంది ఉదయం నుంచే స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రినుండే మాల విసర్జన ప్రారంభం కాగా బుధవారం ఉదయం తెల్లవారు జామున నుంచి వేలాది మంది భక్తులు కొండపైకి చేరుకున్నారు. కొందరు పాదయాత్రగా, మరి కొందరు మెట్ల మార్గం ద్వారా అంజినాద్రి బెట్ట 575 మెట్లు ఎక్కి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. రాత్రి సుమారు 40వేల మంది ఉన్న మాలాధారులు ఉండగా, తెల్లవారు జామున వేళకు లక్షలాది మంది అంజనాద్రి బెట్టకు చేరుకున్నారు. అంజనాద్రి బెట్ట ఎక్కే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పీ సురేష్ ఇట్నాళ్, జిల్లా పోలీసు ఎస్పీ డాక్టర్ రామ్.ఎల్. అరసిద్ధి, అడిషనల్ ఎస్పీ హేమంత కుమార్‌లతో పాటు జిల్లాకు చెందిన సీనియర్ అధికారులు గత రెండు రోజజులుగా అంజినాద్రిలోనే మకాం వేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. హనుమాన్‌మాల విసర్జనలో గుల్బర్గా, గదగ్, హావేరి, దావణగెర, ధారవాడ జిల్లాల నుండి వేలాది మాలధారులు పాల్గొన్నారు.


నాట్యం చేస్తున్న హర్షిత

నాట్య ప్రదర్శనతో అంజనాద్రిపైకి

- 9 నిమిషాల లోపే కొండెక్కిన హర్షిత

బళ్లారి సిటీ(ఆంధ్రజ్యోతి): భక్తిని చాటుకోవడంలో భక్తులు పలు రకాలుగా ఉంటారు. బుధవారం హనుమాన్ మాలధారుల విసర్జన సందర్భంగా హోస్పేటకు చెందిన హర్షిత కింద నుంచి నాట్యం ద్వారానే కొండపైకి చేరకుని భక్తిని చాటుకుంది. అంజనాద్రి మొదటి మెట్టు నుంచి తుది వరకు ఒక సెకను కూడా నిలవకుండా భరతనాట్య నృత్యం ప్రదర్శిస్తూ కొండను ఎక్కి లక్ష్యాన్ని సాధించింది. కేవలం 8నిముషాల 54సెకెండ్లలో పైకి చేరుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఈమె సాధనకు మిత్రబృందం మానస, సుప్రీత, విద్యా, వైభవి, సుదీప్తి, రూపిక, సవితా, శ్రీకృతి తదితరులు సహకరించారు. హర్షిత ఇదివరకే తిరుమల తిరుపతి, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో నాట్యప్రదర్శన ఇచ్చింది.

మరో దశాబ్దం డీప్‌టెక్‌దే హవా

- ఆ రంగానికి రూ.635 కోట్ల గ్రాంట్
- సదస్సులో మంత్రి ప్రియాంక ఖర్గే



అసోచాం సభలో పారిశ్రామిక నిపుణులతో మంత్రి

బెంగళూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా 1700కుపైగా స్టార్టప్‌లకు ఆర్థిక చేయూతను ఇచ్చిన ఏకైక ప్రభుత్వం కర్ణాటక కాగా, మరో దశాబ్దం డీప్‌టెక్‌దే యుగమని ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే అన్నారు. బుధవారం నగరంలో 8వ అసోచాం స్మార్ట్ డేటా సెంటర్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదస్సును ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో సాంకేతిక రంగం ప్రగతిపరంగా ఉందని, ప్రభుత్వం కొత్త పాలసీలను తీసుకురావడం ద్వారా స్టార్టప్‌లు అధికంగా ఆవిష్కృతం అవుతున్నాయన్నారు. 28కిపైగా సంస్థలు డీప్‌టెక్ రంగానికి చేరడం గర్వకారణమన్నారు. ఈ రంగం సామర్థ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. దశాబ్దకాలంపాటు డీప్‌టెక్‌కే ప్రపంచమంతటా ప్రాధాన్యం ఉంటుందన్నారు. కర్ణాటకలో పెట్టుబడులకు ఆసక్తి చూపేవారికి గ్లోబల్ కేపబుల్ సెంటర్ (జీసీసీ) క్యాటలిస్ట్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. రానున్న కాలంలో డేటాసెంటర్లకు ఈ సౌకర్యాన్ని విస్తరింపచేసే ఆలోచన ఉందన్నారు. బెంగళూరు మినహాయించి పెట్టుబడులు పెట్టేవారికి లీప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతిభ, పెట్టుబడులకు పాతపద్ధలకు స్వస్తి పలికి ఆధునాతనమైన విధానాలను అనుమతులకు సరళీకృతం చేశామన్నారు. ఇందుకోసం రూ.300 కోట్లతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. దేవనహళ్ళిలో ఎన్‌టీటీ సంస్థ స్థాపించిన అతిపెద్ద డేటాసెంటర్ క్యాంపస్‌ను వర్చువల్ రూపంలో ప్రారంభించారు. 8.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ క్యాంపస్ 100 మెగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. సదస్సులో అసోచాం నేషనల్ కౌన్సిల్ అండ్ డేటా సెంటర్స్ కో-ఫౌండర్ అండ్ సీఈఓ సునిల్‌గుప్త, జనరల్ సెక్రటరీ మనీష్‌సింఘాల్, టెక్నో ఎలక్ట్రిక్ అండ్ ఇంజనీరింగ్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్, అసోచాం కోఛైర్ శరత్ అగర్వాల్, క్యాపిట్‌ల్యాండ్ ఎండీ సురజిత్ ఛటర్జీ, ఎన్‌టీటీ గ్లోబల్ డేటా సెంటర్ ఎండీ అలోక్ భజ్‌పాల్‌లు పాల్గొన్నారు.

స్టాల్‌ను సందర్శించిన మంత్రి

పీణ్యాకేంద్రంగా పనిచేస్తున్న టైర్ ఎక్స్ సంస్థ సీఈఓ రవికుమార్ బృందం ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంత్రి ప్రియాంకఖర్గే ప్రారంభించారు. డేటాసైన్స్‌కు సంబంధించి రవికుమార్‌తో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.


టైర్ ఎక్స్ స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి ప్రియాంక ఖర్గే

ఘనంగా భక్తుల దినోత్సవం

- వేంకటేశ్వరస్వాముల జన్మదిన వేడుకలకు తరలివచ్చిన భక్తులు

హోసూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హోసూరు తపోవనంలో నారేయణ తాతయ్య ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ వేంకటేశ్వరస్వాముల 84వ జన్మదిన వేడుకలను బుధవార ఘనంగా ఆచరించారు. స్వామిజీ పుట్టినరోజును భక్తుల దినోత్సవంగా పాటిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. మఠం ముఖ్యులు శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ ఆవరణలో స్వామిజీని ఊరేగింపుగా వేదికపైకి తీసుకొచ్చారు. భక్తులను ఉద్దేశించి స్వామిజీ ప్రసంగిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో సాగడం వల్ల మానసిక ప్రశాంతత ఎక్కడికి వెళ్లినా దొరకదన్నారు. పుణ్యక్షేత్రాల సందర్శనకంటే ధర్మమార్గంలో ఆచరించడమే ప్రధానమన్నారు. వారికి దైవానుగ్రహం తప్పక ఉంటుందన్నారు. ఆశ్రమం చేపట్టే కార్యక్రమాలకు భక్తులు ఇతోధికంగా సహకారం అందిస్తున్నారన్నారు. వివిధ మఠాలకు చెందినవారిని ఆత్మీయంగా సత్కరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి వారి ఆశీర్వాదాన్ని పొందారు.


వేంకటేశ్వరస్వాములను సత్కరిస్తున్న భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

కేంద్రంతో పోరాటానికి కలిసిరావాలి

- రాజ్యాంగ రక్షణ అందరి బాధ్యత : సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ
- పార్లమెంటులో ప్రశ్నించే పార్టీలను మోదీ హేళన చేస్తున్నారని ఆగ్రహం
- బళ్లారిలో కమ్యూనిస్ట్ పార్టీ శతవసంతోత్సవం

6

కార్పొరేషన్‌లో ఖాళీల భర్తీ ఎన్నడో..?

- ఏళ్ల తరబడి ఖాళీగా ప్రధాన పోస్టులు
- ఉద్యోగులపై పెరిగిన ఒత్తిడి
- ప్రజలకు అరకొర సేవలే



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1622.43	1629.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,542	3,173
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,374	5,580
నీటి నిల్వ (టీఎంసీలు)	68.41	92.80

బైక్ బోల్తాపడి వ్యక్తి మృతి

బళ్లారిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల చాగనూరు గ్రామానికి చెందిన అశోక్(41) బైక్ అదుపు తప్పి కిందపడిన ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం స్నేహితుడు గోపాల్‌తో కలిసి అనంతపురం జిల్లా విడపనకల్లు గ్రామానికి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా పీడీహళ్లి సమీపంలో జియో పెట్రోల్ బంక్ వద్ద బైకు అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. తీవ్ర గాయాలైన వారిద్దరినీ చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అశోక్ ఆస్పత్రిలో మృతి చెందగా గోపాల్ స్వల్ప గాయాలతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. దీనిపై పీడీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అశోక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ధర్మస్థల సేవలు అమోఘం

● పీఠాధిపతి జపానందస్వామి

పావగడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల గ్రామాభివృద్ధి సంఘం తరుపున సంస్థాపకులు వీరేంద్ర హెగ్డే నిర్వహిస్తున్న పథకాలు ఎంతో ఉత్తేజింపచేస్తున్నాయని పావగడ రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానంద స్వామి కొనియాడారు. బుధవారం ఎస్ఎస్‌కె రంగ మందిరంలో నిర్వహించిన ధర్మస్థల బిల్వార్చన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధర్మస్థల సంఘం చేస్తున్న సేవలు ఎంతో అమోఘమని ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ అన్నారు. కార్యక్రమంలో సమాజ సేవకులు నాని, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప, పావగడ యోజన అధికారి మహేష్, మున్సిపల్ మాజీ అధ్యక్షులు సుదేష్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్రంతో పోరాటానికి కలిసిరావాలి

బళ్లారి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ బీజేపీ అధికారంలోకి వచ్చిన 11 ఏళ్ల కాలంలో దేశాన్ని మరింత అప్పులు పాలు చేసిందని, రాజ్యాంగ రక్షణకు అందరూ తరలి రావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ శతమానోత్సవ జయంత్యుత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలో ప్రధాన వీధులు అరుణమయంగా మారాయి. ఎర్ర జెండాలతో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ సీపీఐ వామపక్షాలు, లౌకిక వాదులు, సామాజిక వాదులు కేంద్రంతో పోరాటానికి కదిలి రావాలన్నారు. బ్రిటీష్ వారి నుంచి దేశాన్ని కాపాడడానికి, సీపీఐ నాయకులు ప్రాణ త్యాగం చేశారని , ఇప్పుడు దేశ రక్షణ కోసం ప్రాణత్యాగాలకు కూడా వెనకాడబోమన్నారు. ర్యాలీ చేసి అనంతరం గాంధీభవన్‌లో సమవేశం నిర్వహించారు. ముందుగా మోతీ సర్కిల్ నుండి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంకు సీపీఐ జిల్లా కార్యదర్శి హెచ్. ఏ ఆదిమూర్తి అధ్యక్షతన వహించగా కార్మిక నాయకుడు మధాయి. టీ. జీ విఠల్, రాష్ట్ర నాయకులు సాధి సుందరేశ్; రాష్ట్ర మండలి నాయకుడు నాగభూషన్‌రావు, ఇతర ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక జాతి, మతాలు, వర్గాల మధ్య చిచ్చులు లేపుతుందన్నారు. బీహార్‌లో దొంగ ఓట్లతో గెలిచారన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో శతమానోత్సవ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. జనవరి 18 వరకూ ఈ ఉత్సవాలు అన్ని



ర్యాలీగా వెళుతున్న సీపీఐ కార్యకర్తలు

రాష్ట్రాల్లో జరుగుతాయని తరువాత పోరాటాల గడ్డ అయిన ఖమ్మంలో జనవరి 18 గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఉద్యోగం లేక యువత ఉపాది కోల్పోతుందన్నారు. మోదీ పెత్తందార్లకు, పెట్టుబడిదారుల చేతిలో కీలబొమ్మగా మారి దేశ ప్రజల భవిషత్తు మరిచిపోయారన్నారు.. వీరితో పాటు పలువులు వక్తలు ప్రసంగించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున సీపీఐ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ఖాళీల భర్తీ ఎన్నడో..?

● ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ప్రధాన పోస్టులు ● ఉద్యోగులపై పెరిగిన ఒత్తిడి ● ప్రజలకు అరకొర సేవలే

బళ్లారి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బళ్లారి మహానగర పాలికె(సిటీ కార్పొరేషన్)లో ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడంతో ఉద్యోగాల ఖాళీలు పెరిగిపోయాయి. దీంతో పెరుగుతున్న జనాబా, పన్నుల వసూళ్ల, ప్రజలకు నగర పాలికె నుంచి అందాల్సిన సేవలు సక్రమంగా, సకాలంలో అందడం లేదు. ఉండాల్సిన ఉద్యోగుల్లో సగబాగం కన్నా ఎక్కవ ఖాళీలు ఉండడం వల్ల ఉండే ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగింది. పైగా ఏ పనులు సకాలంలో జరడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల ఇలా ప్రజానాయకులు ఉద్యోగుల పై పనివత్తిడి పెంచుతున్నారే కానీ ఉండే స్టాఫ్ ఎంత, ఉండాల్సిన స్టాఫ్ ఎంత అని అలోచించడం లేదు. గ్రూప్-ఏ, గ్రూప్-బీ. గ్రూప్ సీ క్యాటగిరికి చెందిన అధికారులు పోస్టులు మహానగర పాలికెలో మొత్తం 316 పోస్టు ఉన్నాయి. ఇందులో అన్ని విభాగల్లో కేవలం 93



బళ్లారి మహానగర పాలికె కార్యాలయం

మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మిగిలిన 226 ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహగన పాలికెలో పబ్లిక్ హెల్ద్, కందాయ, ప్లానింగ్, డిజనింగ్, అకౌటెంట్, ఇలా అన్ని విబాగాల్లోనూ ఖాళీలే ఎక్కవగా ఉన్నాయి. ప్రధానంగా నగర పాలికెకు పనులు వసూళ్ల చేయడం, అలాగే పబ్లిక్ హెల్త్, ఇతరత్రా కీలక పోస్టులు అన్నీ ఖాళీగా ఉన్నాయి. చాలా ఏళ్ల పాటు ప్రభుత్వం పోస్టులను బర్తీ చేయడం లేదు. అలాగే కాంట్రాక్టు పద్దతిలోనూ ఉద్యోగుల నియామకం జరగలేదు. కీలక పోస్టులు అన్నీ ఖాళీ ఉండడం వల్ల అనుకున్న అభివృద్ధి పనులు జరడం లేదు. పైగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజానాయకులు అధికారుల పై పనులు చేయాలని వత్తడి తెస్తున్నారు. ఖాళీల భర్తీ చేయడం లేదని ఉద్యోగ సంఘాలూ విమర్శిస్తున్నాయి. ఉద్యోగాలు భర్తీ చేసి ప్రజలకు సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేష్ హొసమనె

దివ్యాంగులపై వివక్ష చూపరాదు

● సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేష్ హొసమనె

బళ్లారి సిటీ, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులపై వివక్ష చూపరాదని, వారి అభివృద్ధికి అందరూ సహకరించాలని సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేష్ హొసమనె అన్నారు. జోళదరాశి దొడ్డనగౌడ రంగ మందిరంలో బుధవారం జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయసేవల ప్రాదికార సంస్థ, సీనియర్ సిటీజన్ల ప్రాదికారత శాఖ, మహిళా శిశు అభివృద్ది శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శారీరకంగా, మానసికంగా దృడంగా ఉన్నవారు మాత్రమే అలసిపోయే కష్టతరమైన జీవితాలను గడుపుతారన్నారు. దివ్యాంగులు ఎటువంటి మద్దతు లేకుండా కష్టాలు, బాధలు నిస్సహాయక సమయాల్లో కూడా దృఢ సంకల్పంతో తమ జీవతాన్ని గడపడం హర్షణీయమన్నారు. దివ్యాంగులకు తల్లిదండ్రులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయమన్నారు. సహకరిస్తే వారు కూడా ఎన్నో అద్బుతాలు సాధించగలరన్నారు. శాస్త్రవేత్త స్టీపెన్ హాకింగ్ తన వైకల్యాన్ని అధిగమించి సాధనలో శిఖరాగ్రానికి చేరుకున్నారన్నారు. మేయర్ గాదెప్ప మాట్లాడుతూ సమాజంలోని దివ్యాంగులకు స్వతంత్రంగా జీవించాలనే కోరిక ఉంటుంది. వారిని కనికరం చూపకుండా సమాన్వంతో చూడాలని అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విజయం సాధించిన దివ్యాంగులను ఘనంగా సత్కకరించారు. ఈసందర్భంగా బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్ పీఎస్ఐ మహంతేశ్, ఏపీఎంసీ పోలీస్ స్టేషన్ పీఎస్ఐ మహ్మద్ రఫీ, శిశుఅభివృద్ధి శాఖ డైరెక్టర్ రామకృష్ణనాయక్, డాక్టర్ వీరేంద్రకుమార్, విద్యాశాఖ లక్ష్మీదేవి, సవిత, కార్తీక్, దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు జాపర్ సాధిక్,మహిళా శిశు అభివృద్ది శాఖ డైరెక్టర్ సవిత,సీనియర్ సిటీజన్స్ గోవిందప్ప, వివిధసంస్థల ఆపీస్ బేరర్లు, స్వచ్చంద సేవకులు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో పర్యావరణ దినోత్సవం



విద్యార్థులతో మాతృమహిళామండలి అధ్యక్షురాలు పుష్ప చంద్రశేఖర్

బళ్లారిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాతృ మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని మార్కా డిగ్రీ కళాశాల ఆవరణంలో బుధవారం నిర్వహించారు. మాతృమండలి అధ్యక్షురాలు పుష్ప చంద్రశేఖర్ విద్యార్థుల నేతృత్వంలో చెట్టుకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుష్పలత మాట్లాడుతూ చెట్లు పెంచడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చని, పర్యావరణ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా చెట్లు కొన్ని జ్ఞాపకార్థాలు నిదర్శనంగా వుంటాయని స్కూలు కాలేజీ మైదానాలలో చెట్లు నాటడం వల్ల పర్యావరణం వుంటుందని చెట్లు నాటడం ప్రకృతికి చిన్నంగా జ్ఞాపకార్థంగా వుంటుందన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్క నాటడం వల్ల ప్రపంచ కాలుష్యాన్ని తగ్గించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోజ, తిప్పేరుద్ర, సందీప్, చంద్రశేఖర్ అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



దీప ప్రజ్వలనలో మేయర్ సత్య తదితరులు

వైభవంగా కార్తీక దీపోత్సవం

హోసూరు డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తమిళుల సంప్రదాయం ప్రకారం హోసూరులోని చంద్రచూడేశ్వర ఆలయంలో కార్తీక మహాదీపం వెలిగించారు. బుధవారం ఉదయం నుంచి విశేషపూజలు కొనసాగాయి. సాయంత్రం దీపోత్సవాన్ని తిలకించేందుకు భక్తాదులు తరలివచ్చారు. హోసూరులోని తేరుపేట కొండపై మరకతాంబ సమేత చంద్రచూడేశ్వర ఆలయానికి చరిత్ర ఉంది. పురాతన ఆలయంలో శివుడు స్వయంభువుగా వెలిశాడని ప్రతీతి. ఇక్కడికి తమిళనాడు నుంచి మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలనుంచి భక్తులు వస్తుంటారు. ప్రతి సంవత్సరం మార్చి నెలలో స్వామివార్ల రథోత్సవం వైభవంగా జరుగుతుంది. 2014 వరకు ఆలయ విమాన గోపురంపై 100 లీటర్ల నెయ్యితో జ్యోతి వెలిగించేవారు. మహాదీపాన్ని ప్రస్తుతం ప్రజల సహకారంతో 1000 లీటర్ల నెయ్యితో దీపం వెలిగించేలా ఏర్పాట్లు చేశారు. విమాన గోపురంపైకి ప్రత్యేక ఇనుపమెట్లు అమర్చారు. కార్తీక మహాదీపాన్ని బుధవారం సాయంత్రం 6.30 గంటలకు వెలిగించారు. వర్షం కురుస్తున్నప్పటికి భక్తులు స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. మరకతాంబ చంద్రచూడేశ్వర స్వామి వారికి వివిధ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయ వీధులలో ఊరేగించారు. హోసూరు, చుట్టుప్రక్కల ఉన్న శివాలయాలల్లో మహాదీపం వెలిగించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఆకృతిశెట్టి, ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మాదేశ్వరన్, కృష్ణమూర్తి, బీజేపి నాగరాజు, రాము, శక్తివేల్, బాలాజీ, చూడప్ప, రాజీ, ఆది, మురుగన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పరికరాల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందజేస్తున్న మేయర్

హోసూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హోసూరు ప్రభుత్వ పాఠశాలలో ఒక ప్రైవేట్ కర్మాగారం సీఎస్ఆర్‌లో భాగంగా దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక పరికరాలను మేయర్ సత్య అందజేశారు. బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో హోసూరు కార్పొరేషన్ కామరాజు కాలనీ ప్రాథమిక పాఠశాలలో టైటాన్ టీల్ సంస్థ తరపున 30 మందికి పరికరాలు అందచేశారు. మేయర్ మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుండడంపై అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు మోహిస్ తాజ్, నిసార్, నాగరాజు, ప్రాథమిక పాఠశాల జిల్లా విద్యా అధికారి వేద, ఆర్‌వీ ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ వళర్మతి, జిల్లా సంఘ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకేలో వందమందికిపైగా చేరిక

హోసూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా వేపనపల్లి శాసనసభ నియోజకవర్గం తూర్పు యూనియన్ కార్యదర్శి అప్పయ్య నేతృత్వంలో ఏర్పాటైన కార్యక్రమంలో వందమందికిపైగా డీఎంకేలో కార్యకర్తలు చేరారు. పంగనహళ్లి పంచాయతీ నుంచి 100 మందికిపైగా అన్నాడీఎంకేను వీడినవారు డీఎంకే జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్ సమక్షంలో డీఎంకేలో చేరారు. కార్యక్రమంలో జిల్లా ఉప కార్యదర్శి మురుగన్, మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర యువజన విభాగం ఉప కార్యదర్శి శ్రీనివాసన్, జిల్లా పంచాయతీ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు శేఖర్‌షిద్, యూనియన్ కార్యదర్శి భాగ్యరాజు, యూనియన్ మాజీ కార్యదర్శి వెంకటేశ్, అన్బుశేఖర్, జిల్లా మహిళా విభాగం సాలమ్మ ఇతర నిర్వాహకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కార్యకర్తలు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

● అవగాహన సదస్సులో జిల్లా అగ్నిమాపక అధికారి హనుమనగౌడ పోలీస్ పాటిల్

బళ్లారి సిటీ, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, దీంతో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడొచ్చని జిల్లా అగ్నిమాపక అధికారి హనుమనగౌడ పోలీస్ పాటిల్ సూచించారు. గురువారం నగరంలోని సరళాదేవి కాలేజ్ అవారణలో భారత స్కౌట్స్ గైడ్స్ రోవర్స్ ,రేంజర్స్ యూనిట్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన అగ్ని ప్రమాద అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అకస్మికంగా మంటలు ఏర్పడినప్పుడు ఇంట్లో నీటిని బదులుగా మట్టిని వేసి మంటలను ఆర్పివేయాలన్నారు. అప్రమత్తంగా ఉంచే ఎన్నో ప్రమాదాలు జరగకుండా చూడవచ్చన్నారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రహ్లాద్ చౌద్రి విద్యార్థులు ఈకార్యక్రమం నుంచి నేర్చుకున్న విషయాలను జన సముదాయానికి చేరాలన్నారు. వేదికపై వివిధ యూనిట్ల సంచాలకులు డా.పల్లవి, డా.సలిహా, గురుబసప్ప, గంటెప్పశెట్టి తదితరులున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

డిప్యూటీ మేయర్‌గా మోబినాబీ బాధ్యతల స్వీకరణ



డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మోబినాబీ

బళ్లారిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర మహానగరి పాలికె కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా మోబినాబీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్ని మతాల గురువులు, కల్యాణస్వామి క్రైస్తవమత పెద్దలు సహాసిని తదితరులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భగా మోబీనా బీ మీడియాతో మాట్లాడుతూ బళ్లారి నగర అభివృద్ధికి అధికారులు, ప్రజలు సహకరిం చాలన్నారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరిస్తానని, ప్రజలకు అందుబాటులో వుంటానని, నగరంలో పారిశుద్యం తాగు నీటి వీధి దీపాల సమస్యల లేకుండా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంల నిర్వహణ అందరి బాధ్యత: సీఈవో



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ సీఈవో మహమ్మద్ హారీస్

బళ్లారి సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గోశాలలు, చెక్‌డ్యామ్‌లు పాటు అనేక ఇతర పనులు పూర్తయ్యాయని వీటి నిర్వహణను కేవలం శాఖ లేదా పంచాయతీ విధిగా పరిగ ణించకూడదని రైతుల కూడా సహకరించాలని జిల్లాపంచాయతీ సీఈవో మహమ్మద్ హారీస్ అన్నారు. బుధవారం తాలూకాలోని రూపనగుడి వ్యాప్తిలోని యాల్పి , కగ్గల్ గ్రామంలో వ్యవసాయశాఖ, వాటర్ షెడ్ అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ మహోత్సవ ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొత్త రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేయాలన్నారు. పీఎంఎఫ్ఏఈ పథకాన్ని మహిళా రైతులు , స్వయం సహాయక బృందాలు ఉపయోగించుకోవాలన్నారు. నేల లక్షణాలను కాపాడుకోవడానికి రైతులు సేంద్రియ ,సహజ వ్యవసాయానికి ప్రాదాన్యత ఇవ్వాలి,పరిశ్రమ ఇతర రంగాల కంటే వ్యవసాయం చాలా ముఖ్యమైన రంగం అని ఆయన అన్నారు. ఈసందర్భంగా వ్యసాయ సంయుక్త సంచాలకలు సోమసుందర్, వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ఆదిపతి డాక్టర్ పాలయ్య, వ్యవసాయా శాస్త్రవేత్తలు రవి, కృష్ణమూర్తి, మంజునాథ్, సముద్రరాజు, లక్ష్మీ, గ్రామ రైతులు లోకనగౌడ, జనార్దన్ రెడ్డి,స్వయం ఉపాది సిబ్బంది, గనుల పర్యావరణ పునరావాస సిబ్బంది, కృషి సంజీవిని సిబ్బంది, ఉద్యావన శాఖ అధికారులు, ఆటవీ శాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలకు బెస్ట్ కాలేజీ విద్యార్థినులు

బళ్లారి సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీదర్ జిల్లా బసవకల్యాణంలో జరిగిన విభాగస్థాయి సాంస్కృతిక పోటీలలో నగరానికి చెందిన బెస్ట్ కళాశాల విద్యార్థినులు పలు అవార్డులను కైవశం చేసుకున్నారు. ఈ నెల 15న తుమకూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు కళాశాల యాజమాన్యం ప్రకటించింది. విజేతలను బెస్ట్ సంస్థ అధ్యక్షులు కోనంకి రామప్ప, ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్‌కుమార్, కార్యదర్శిలు మన్నె శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఉపప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, కళాశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థులు మరింత ప్రతిభ చాటి అక్కడ కూడా విజయం సాధిచాలని కోరారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

కుసుమ (జనపద నృత్యం -- ప్రథమస్థానం)
సుష్మిత(ఆంగ్ల చర్చాపోటీ-- ద్వితీయ స్థానం)
ఐశ్వర్యకావ్య(రసప్రశ్నలు క్విజ్‌లో-- తృతీయ స్థానం)



విజేత విద్యార్థినులను అభినందిస్తున్న బెస్ట్ కాలేజీ యాజమాన్యం

ఆర్వో ప్లాంటును బాగు చేయండి

● మరమ్మతులు చేపట్టకపోవడంపై గ్రామస్థుల నిరసన



ఆర్వో ప్లాంటు ముందు ఖాళీ బిందెలతో గ్రామస్థులు

కంప్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని చిక్కజాగనూరు గ్రామంలో సుంకులమ్మ దేవాలయం వద్ద ఉన్న ఆర్‌వో ప్లాంటుకు మరమ్మత్తులు చేపట్టాలని మహిళలు ఆందోళన చేపట్టారు. బుధవారం మహిళలు లక్ష్మీ, అంజనమ్మ, విరుపమ్మ, నాగలక్ష్మి, అంజి, సుంకన్న మాట్లాడుతూ నాలుగు నెలల నుండి ఆర్‌వో ప్లాంటు నుంచి నీరు రాక గ్రామానికి పక్కనే వున్న కాలువ, బోర్ల నీరు తాగుతున్నామన్నారు. గ్రామానికి పక్కనే ఉన్న బల్లాపురం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తపరిచారు. గ్రామ పంచాయతీ సభ్యులకు, బిల్ కలెక్టర్ గ్రామ పంచాయతీ అధ్యక్షులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా నీటి ఎద్దడిని దృష్టిలో వుంచుకుని ధ్వంసమైన ఆర్వో ప్లాంటు మరమ్మత్తు పనులు జరపించాలని వారు కోరారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో గీతాయజ్ఞం



గీతోపదేశం చేస్తున్న సరస్వతీ స్వాములు

సిరుగుప్ప, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భగవద్గీత హిందువుల పవిత్ర గ్రంథమని కౌతాళం శివరామదూత ఆశ్రమం గురువులు సరస్వతీ స్వాములు తెలిపారు. సిరుగుప్ప పట్టణం అభయాంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ రాంపురం మఠం ఆధ్వర్యంలో గీతాజయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని సరస్వతి స్వాములు ప్రారంభించి మాట్లాడారు. భగవంతుని స్మరణ చేస్తే విజయం సిద్ధిస్తుందని ఆయన తెలిపారు. విద్యార్థులు గీతాపారాయణాన్ని పఠించారు. వివిధ ధార్మిక కార్యక్రమాలను ఉద్దేశించి స్వాములు మాట్లాడారు. కార్యక్రమంలో రాంపురం మఠం పీఠాధిపతి రాజశేఖరయ్యతాత, కైవల్యానంద స్వామి, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కళాకారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.


ఉద్యోగికి ఘన సన్మానం

సిరుగుప్ప, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ట్రెజరీ శాఖలో విధులు నిర్వహిస్తున్న అల్లాబకాష్ అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా ఉద్యోగోన్నతి పొందడంతో సిరుగుప్ప తాలుకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌసియా బేగమ్ మాట్లాడుతూ అల్లాబకాష్ ఉత్తమ సేవలు అందించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉచ్చీరప్ప మాట్లాడుతూ అల్లాబకాష్ మరిన్ని ఉత్తమ సేవలతో ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శ్రీధర, ఉద్యోగుల సంఘం పదాధికారులు యేసయ్య, చంద్రకాంత్, అరుణ ప్రతాప్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మద్దేరు సిద్దయ్య, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని నగరసభ ఇన్‌ఛార్జ్ కమీషనర్ రమేష్, పౌర కార్మికుల సంఘం అధ్యక్షుడు రంగస్వామి, కార్యదర్శి పంపాపతి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ఉన్నవ లక్ష్మీనారాయణ (జయంతి)



తెలుగు నవలా సాహిత్య వైతాళికుడిగా ఆయన సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేసిన న్యాయవాది ఉన్నవ లక్ష్మీనారాయణ 1877 డిసెంబరు 4న గుంటూరులో జన్మించారు. గాంధేయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా తనదైన గుర్తింపు పొందారు. ఆయన రచించిన నవల 'మాలపల్లి' తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక ముఖ్యమైన ఘట్టం. స్త్రీ విద్య కోసం శ్రీ శారదా విద్యానికేతన్ నెలకొల్పారు. గుంటూరులో యంగ్ ఉమెన్స్ లిటరరీ అసోసియేషన్‌ను, వితంతు శరణాలయాన్ని స్థాపించారు. వీరేశలింగం పంతులు అధ్యక్షతన తొలి వితంతు వివాహం జరిపించారు. కాగా ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నందుకు జైలు శిక్ష అనుభవించారు. 1958 సెప్టెంబరు 25న తుదిశ్వాస వీడారు.

ఘంటసాల (జయంతి)



తెలుగు సినిమా సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ఘంటసాల వెంకటేశ్వరరావు 1922 డిసెంబరు 4న కృష్ణా జిల్లా గుడివాడలో జన్మించారు. పట్రాయని సీతారామ శాస్త్రివద్ద క్షుణ్ణమైన శాస్త్రీయ సంగీత శిక్షణ పొంది రాణించారు. తెలుగు సినిమా తొలితరం నేపథ్య గాయకులలో ఘంటసాల ప్రముఖులు. ఎవరైనా పాటలు బాగా పాడుతున్నారంటే వారిని ఘంటసాల గారితో పోల్చేవారు, అంతలా ప్రభావితం చేశారనడంలో అతిశయోక్తి లేదు. 1951లో పాతాళ భైరవి విజయంతో ఘంటసాల పేరు మారుమోగింది. ఐరోపా, అమెరికాలలో కూడా సంగీత ప్రదర్శనలు చేశారు. వ్యాఖ్యానంతో సహా ఆయన ఆలపించిన భగవద్గీత ఎంతో ప్రజాదరణ పొందింది. 1970 వరకు దాదాపు ప్రతిపాట ఘంటసాల పాడినదే. ఎంత గొప్ప స్థితికి చేరుకున్నా తనను ఆదరించినవారిని మరువ లేదు. 1974 ఫిబ్రవరి 11న కన్నుమూశారు.

శశికపూర్ (వర్ధంతి)



పద్మభూషణ్ గ్రహీత శశికపూర్ 1938 మార్చి 18న కోల్కత్తాలో జన్మించారు. పృథ్వీరాజ్ కపూర్‌కు మూడో కుమారుడు, రాజ్ కపూర్, షమ్మి కపూర్‌లకు సోదరుడు. తండ్రి దర్శకత్వంలోని సినిమాల్లో నటుడిగా రాణించి సత్తా చాటుకున్నారు. హిందీ సినీ రంగంలో సోలో హీరోగా తనదైన గుర్తింపు పొందారు. నాలుగు జాతీయ ఫిల్మ్ అవార్డులు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 2017 డిసెంబరు 4న కన్నుమూశారు.

గాంధీ గ్రామ పురస్కారంపై హర్షం

- రూ.5లక్షల రివార్డు అభివృద్ధి పనులకే...
- గూళూరు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు అనురాధ రమేశ్



పురస్కారం అందుకుంటున్న గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అనురాధ రమేశ్, పీడీఓ కృష్ణమూర్తి

బాగేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పాలనా నిర్వహణ, అభివృద్ధి పనులకుగాను 2023-24 వార్షిక గాంధీ గ్రామ పురస్కారానికి తాలూకాలోని గూళూరు గ్రామపంచాయతీ అందడంపై హర్షం వ్యక్తం చేశారు. గూళూరు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు అనురాధ రమేశ్, పీడీఓ కృష్ణమూర్తిలు పట్టణంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు విధానసౌధ బ్యాంక్వెట్‌హాల్‌లో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో పురస్కారాన్ని పంచాతీరాజ్‌శాఖ మంత్రి ప్రియాంకఖర్గే నుంచి పురస్కారం పొందామన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఇచ్చిన ప్రశ్నాపత్రానికి సమంజసమైన జవాబులు ఇచ్చామని తద్వారా ఎక్కువ మార్కులు సాధ్యమయ్యాయన్నారు. పంచాయతీ పరిధిలో వీధిదీపాల నిర్వహణ, స్వచ్ఛత, శుద్ధతాగునీరు వ్యవస్థ సహా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందచేయడంలో విజయ వంతంగా అమలు చేశామని అందుకు పురస్కారానికి ఎంపికైనట్టు తెలిపారు. పీడీఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ గాంధీ గ్రామ పురస్కారం కింద రూ.5లక్షల నగదు బహుమతి లభించిందన్నారు. ఈ మొత్తంతో తాగునీటి పథకం విస్తరణ, సముదాయ శౌచాలయ, ఇతర కార్యక్రమాలు చేపడతామన్నారు.



గూళూరు గ్రామపంచాయతీ కార్యాలయం

నేడు మళ్లూరాంబ బ్రహ్మరథోత్సవం

శిడ్లఘట్ట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవరమళ్ళూరులో గ్రామదేవత మళ్ళూరాంబ బ్రహ్మరథోత్సవం గురువారం జరగ నుంది. ఏటా డిసెంబరులో జాతర, పశువుల పరుష నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం ప్రారంభమైన ప్రత్యేక పూజలు ఈనెల 8వరకు కొనసాగనున్నాయి. 9న పశువుల పరుష, ఉత్తమ ఆవులకు బహుమతుల ప్రదానం ఉంటుంది. వందల సంవత్సరాలక్రితం దేవరమళ్ళూరు గ్రామాన్ని గోపాల గౌడ అనే పాళెగార పాలించేవారని, మడ్లూరు సంస్థానంగా పిలిచేవారని శాసనాల ద్వారా తెలుస్తోంది. సంస్థానం పరిధిలో బెంగళూరు జిల్లా నందగుడి, ఆవతి, గుడిబండ సమీపంలోని వర్లకొండ, చేళూరు వరకు ఉన్నట్టు సమాచారం. జానపద కథల ప్రకారం మడ్లూరులో రాక్షససంహారం కోసం వెయ్యి హోమాలు ఏర్పాటు చేసి పంచమహాశక్తిని ఆహ్వానించి శక్తిదేవతకు హోమద్రవ్యాలను సమర్పించేందుకు ఉన్న రాతి ఆనవాళ్లను నేటికీ గమనించవచ్చు. ఆదిశక్తి, పరాశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులను ఆవా హన చేసి అంబాసురుడి సంహారం అనంతరం పంచమహాశక్తిదేవతలకు సారె ఇచ్చి పంపారు. అప్పటినుంచి ఈ ప్రాంతాన్ని మడిలూరు అని పిలుస్తారు. కాలక్రమంలో మడ్లూరు, మళ్ళూరుగా మారిందని ప్రతీతి. ఇక్కడి స్థల మహిమ కారణంగా త్రిమతస్థులు మధ్వాచార్యులు, రామానుజాచార్య, శంకరాచార్య సందర్శించారని తెలుస్తోంది. గత మూడేళ్లగా ఆలయాన్ని అభివృద్ధి చేశారు. నూతనంగా పుష్కరిణి, భక్తులకు తాగునీరు, శౌచాలయం, రథంకోసం ప్రత్యేక సౌలభ్యం, హోమం మంటపం, ఇంకా సీసీటీవీ కెమెరాలు వంటివి ఏర్పాటు చేసినట్టు ఆలయ అభివృద్ధి సమితి అధ్యక్షుడు మునిరాజుగౌడ, ఇన్‌చార్జ్ సుబ్రమణియప్ప తెలిపారు. రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



మళ్ళూరాంబ దేవికి విశేష అలంకరణ

స్టార్టప్‌లు సమస్యల పరిష్కారానికి బాటలు కావాలి

- మేలా వెంచర్స్ పార్ట్‌నర్ కృష్ణకుమార్ నటరాజన్

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్టార్టప్ సంస్థలు సమస్యల పరిష్కారానికి, సమాజ అభివృద్ధికి అండగా ఉండాలని రామయ్య ఎవల్యూట్ స్టార్టప్ అవార్డు 2025లో మేలా వెంచర్స్ పార్ట్‌నర్ కృష్ణకుమార్ నటరాజన్ పేర్కొన్నారు. రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లో ఏర్పాటైన అవార్డుల ప్రదానంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఆవిష్కారం వెంటనే డబ్బు వచ్చేదిలా ఉండాలని భావించరాదన్నారు. తొలుత సమస్యకు పరిష్కారంగా ఉంటే విజయం సాధ్యమని, తర్వాత వినియోగదారులు ఆదరిస్తారన్నారు. బెంగళూరు నగరం స్టార్టప్‌లకు కేంద్రంగా ఉందన్నారు. రామయ్య ఎవల్యూట్ కో-ఫౌండర్ డాక్టర్ సమర్థ్ నాగభూషణ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 500 అప్లికేషన్లు వచ్చాయని 22 ఎంపికయ్యాయన్నారు. వాటికి సుమారు రూ.2కోట్ల ఆర్థికసాయం ఇవ్వనున్నట్టు తెలిపారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎంఆర్ సీతారాం, వైస్ ఛైర్మన్ ఎంఆర్ జానకిరాం, కార్యదర్శి ఎంఆర్ ఆనందరాం, ఆర్‌ఐటీ డైరెక్టర్‌లు ఎంఆర్ సంపంగిరామయ్య, ఎంఆర్ కోదండరాం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఆర్ నాయుడు, ఈడీ డాక్టర్ హెచ్‌వీ పార్శ్వనాథ్, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ కరిసిద్దప్ప, సీఈఓ డాక్టర్ ఎంటీ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



స్టార్టప్ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖులు

50 మందికి త్రిచక్రవాహనాలు



త్రిచక్రవాహనాలు పంపిణీ చేస్తున్న ఇరు సంస్థల ప్రముఖులు

బెంగళూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమర్థనం ట్రస్టు ఫర్ డిజెబుల్డ్, ఆప్టమ్ ఇండియా సంయుక్త సహకారంతో మోటారుతో నడిచే 50 త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు. బుధవారం నగరంలో ప్రత్యేక కార్యక్రమంలో 150మందికి అత్యాధునిక సహాయక సాధనాలను పంపిణీ చేశారు. ఆప్టమ్ ఇండియా ఎండీ ఉమారత్నం క్రిష్ణన్, సమర్థనం ట్రస్టు సంస్థాపకులు డాక్టర్ మహంతేశ్ జీ కివడసణ్ణవర్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యులుగా కార్మికశాఖ కమిషనర్ డాక్టర్ హెచ్‌ఎన్ గోపాలకృష్ణ, దివ్యాంగ హక్కుల రాష్ట్ర కమిషనర్ దాస్ సూర్యవంశి, ఎమ్మెల్సీ నాగరాజ్ పలువురు పాల్గొన్నారు. ఉమారత్నం మాట్లాడుతూ సమాజంలో అందరూ స్వతంత్రంగా జీవించాలనేది మా బాధ్యత అన్నారు. భారత్‌లో భారత్‌కోసం అనే నినాదంతో పాఠశాలల్లో ఉత్తమమైన నైపుణ్య వాతావరణం కల్పిస్తున్నామన్నారు. సమర్థనం ట్రస్టుతో కలసి మా వంతుగా సహకరిస్తున్నామన్నారు. మహంతేశ్ మాట్లాడుతూ ఎవరైనా కలలను సాకారం చేసుకోవాలంటే మనం చేసిన సహాయం కూడా తోడ్పడాలన్నారు. సమర్థనం జాతీయ ఉత్తమ పురస్కారం పొందిన సంస్థ అని, అందుకు ఎంతోమంది సహకారం చేదోడు వాదోడు ఉందన్నారు.

బోగస్ పత్రాల పుట్ట..!

- కొమరేపల్లి సచివాలయంలో మాయలు

మడకశిర/మడకశిరటౌన్/అగళి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అగళి మండలంలోని కొమరేపల్లి చిన్న గ్రామం. అలాంటి ఊరిలో ఏకంగా 3,981 జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. పక్క జిల్లాలు, రాష్ట్రాల వారికి సైతం ఇక్కడ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఓ వ్యక్తి.. రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేయడం, వారి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టింది. ఇందులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

రాష్ట్ర అధికారుల ఆదేశాలతో..


వినయ్‌కుమార్ గుప్తా అనే వ్యక్తి 1985 ఆగస్టు 5న జన్మించినట్లు కొమరేపల్లి సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. అది బోగస్ సర్టిఫికెట్ అంటూ ఆశిష్‌కుమార్ గుప్తా అనే వ్యక్తి విజయవాడ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులు.. విచారణ చేపట్టి వాస్తవాలు తేల్చాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆ మేరకు జిల్లా అధికారులు కదిలారు. జిల్లా గణాంకాల నోడల్ అధికారి కళాధర్ మంగళవారం కొమరేపల్లి సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రాల జారీపై ఆరాతీశారు. ఇన్‌చార్జి కార్యదర్శి మహేష్‌ను విచారించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి, ఎన్ని సృష్టించారో తేల్చనున్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. ఈ సచివాలయం ద్వారా వివిధ రాష్ట్రాల వారికి 3,981 జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరైనట్లు గుర్తించారు. సంబంధిత ఇన్‌చార్జి కార్యదర్శి మహేష్‌ను విచారించగా.. సెప్టెంబరు 14న ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుని, ఐడీ పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వగా.. అందులో అప్పటికే 129 జనన ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని కూడా నిలిపి వేశామన్నారు. విషయాన్ని ఆయన ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. కాగా, బోగస్ సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

బైక్ రేసర్ల ఆటకట్టు..

- వలపన్ని పట్టుకున్న పోలీసులు
- 106 బైక్‌లు సీజ్



సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీజ్‌చేసిన ద్విచక్రవాహనాలు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన యువకులు

సోమందేపల్లి/పెనుకొండ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెనుకొండలో బాబయ్య స్వామి గంధం ఉత్సవాల నేపథ్యంలో పేట్రేగిపోతున్న బైక్ రేసర్ల ఆట కట్టించారు పోలీసులు. 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి పెనుకొండ, సోమందేపల్లి వద్ద వలపన్నారు. హిందూపురం, బాగేపల్లి, గౌరీబిదనూరు, గుల్బర్గా, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన యువకులు అర్ధరాత్రి వేళ ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతుండగా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. 106 బైక్‌లను సీజ్‌చేసి సోమందేపల్లి, పెనుకొండ స్టేషన్లకు తరలించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పెనుకొండ, సోమందేపల్లి, చెన్నేకొత్తపల్లి, కదిరి, గోరంట్ల, మడకశిర, రొద్దం మండలాలకు చెందిన పోలీసులు పెనుకొండ నుంచి సోమందేపల్లి వరకు జాతీయరహదారిపై ముమ్మర తనిఖీలు నిర్వహించారు. పెనుకొండలో బాబయ్య స్వామి ఉరుసు నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. సీజ్‌చేసిన ద్విచక్రవాహనాలను పుట్టపర్తికి తరలించారు. తరలించే సమయంలో సోమందేపల్లి పోలీసు స్టేషన్ వద్ద బైకర్లకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జరిమానాలు వేసి, ఇక్కడే వదిలేయాలనీ, పుట్టపర్తికి తరలించరాదని యువకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పుట్టపర్తిలో మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ వద్ద ద్విచక్రవాహనాల రికార్డులు సక్రమంగా ఉంటే చూపి, విడిపించుకెళ్లాలని పోలీసులు సూచించారు. లేనిపక్షంలో జరిమానా కట్టి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. దీనిపై సీఐ రాఘవన్ మాట్లాడుతూ.. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా జాతీయరహదారిపై తనిఖీలు చేపట్టామన్నారు.

త్వరలో లబ్ధిదారులకు ఆదర్శ గృహాలు : మంత్రి



దరఖాస్తులను పరిశీలిస్తున్న మంత్రి సురేశ్

రాయచూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగర సమీపం యరమరస్ వద్ద జీ+3 మోడల్‌లో నిర్మిస్తున్న ఇళ్లను త్వరలోనే ఎంపిక చేసిన లబ్ధిదారులకు అందజేస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ అన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను మంత్రి బుధవారం పరిశీలించారు. బళ్ళారి నుంచి హెలిక్యాప్టర్‌లో మధ్యాహ్నం నగరానికి చేరుకున్న మంత్రి వెంటనే స్థానిక యరమరస్ సమీపంలోని ఇళ్ల నిర్మాణ పనుల దగ్గరకు వెళ్లి పనులు జరుగుతున్న తీరు పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మొత్తం 2419 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా వారిలో ఎస్సీలు 951, ఎస్టీలు 1053, జనరల్ వర్గీయులు 228, బీసీలకు 187 ఇళ్లను అందజేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. మొత్త 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ ఇళ్లను త్వరలోనే పూర్తి చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆవాస్ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.2.50 లక్షలతో కలిపి మొత్తం ఇంటి నిర్మాణం 9 లక్షల వరకు ఉంటుందని జిల్లాధికారి, మహానగర పాలిక కమిషనర్‌లు మంత్రికి వివరించారు. మిగితా సొమ్మును బ్యాంకుల ద్వార లబ్ధిదారులకు రుణంగా ఇప్పించేందుకు నిబంధనలు ఉన్నట్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి భైరతి సురేశ్, రాయచూరు చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తంలో ఒకే సారి లబ్ధిదారులకు ఇళ్లు అందచేయడం అద్భుతమని ఇది తమ ప్రభుత్వం సాధించిన విజయమన్నారు. రాష్ట్రంలోని మరికొన్ని చోట్ల ఇదే రకమైన ఇళ్ల నిర్మాణం జరుగుతున్నట్లు వివరించిన మంత్రి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామి మేరకు అన్ని పనులను సకాలంలో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

అధికారం శాశ్వతం కాదనడం వైరాగ్యం కాదు

ప్రజాస్వామిక వ్యవస్థలో అధికారం శాశ్వతం కాదన్న మాట రాజకీయ వైరాగ్యంతో కూడింది కాదని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ అన్నారు. బుధవారం నగరానికిచ్చిన మంత్రి తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన ఈ వ్యాఖ్యలను కొంత మంది వక్రీకరిస్తుండడాన్ని మంత్రి తప్పుబట్టారు. తనతో పాటు ఎవ్వరు ఈ వ్యాఖ్యలు చేసినా అది వైరాగ్యం కాదన్నారు. ప్రజల మద్దతు ఉన్నంతవరకు ప్రభుత్వాలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. అది ఇందులో ఉన్న అర్థమన్నారు. కాగా రాష్ట్రంలో ప్రభుత్వ నాయకత్వ మార్పు అనేది హైకమాండ్ తీసుకోవల్సిన నిర్ణయమని హైకమాండ్ తీసుకున్న నిర్ణయానికి ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రితో సహా పార్టీ శ్రేణులంతా కట్టుబడి ఉంటారని మంత్రి స్పష్టం చేశారు. అల్పాహార విందులు అనేవి నాయకులు,రాజకీయ పార్టీల మధ్య సహజమని ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, మంత్రులు అల్పాహార విందుల్లో పాల్గొనడం సహజమని ఇందులో ప్రత్యేకించిన అంశాలు ఏమి ఉండవని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.



హారతి తీసుకుంటున్న విద్యారణ్య భారతిస్వామి

నెట్టికంటి సన్నిధిలో హంపి పీఠాధిపతి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురంలో నెట్టికంటి ఆంజనేయస్వామిని బుధవారం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామీజీకి స్వాగతం పలికారు. ప్రతి సంవత్సరం జరిగే హనుమద్ వ్రతం, దత్తజయంతి ఉత్సవాల్లో స్వామీజీ పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం విద్యారణ్య స్వామిజీ ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులకు ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో బెల్దాణ స్వాములు రామనాథ్ శాస్త్రి, వేణుగోపాల శాస్త్రి, శివశంకర శాస్త్రి, స్వామిజీ శిష్య బృందం మంజుల వెంకటేష్, ప్రదీప్‌ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం బలహీనత కాదు: కలెక్టర్ కవిత

హొస్పేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) దివ్యాంగులకు శారీరక వైకల్యం ఉండవచ్చు కానీ ప్రత్యేక సామర్థ్యాలు ఉన్నవారికి వైకల్యం బలహీనత కాదు అని విజయనగర కలెక్టర్ కవితా ఎస్. మన్నికేరి అన్నారు. నగరంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మంటపంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగులు దినోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి అమె మాట్లాడుతూ సమాజంలో మానసిక దివ్యాంగులు పెరుగుతున్నదని ప్రజలు మురికి మనస్తత్వం కొంతమంది వికలాంగుల అభివృద్ధికి అడ్డంకి అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటే దివ్యాంగుల హక్కులు, గౌరవం శ్రేయస్సు సాధ్యమవుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎన్. రూపేష్ కుమార్, జిల్లా పంచాయతీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎ. తిమ్మప్ప జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి రామాంజనేయ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్

కార్తీక్‌నగర్‌లో సాలుమరద తిమ్మక్క ఉద్యానవనం



పార్కులో జిమ్ ఉపకరణాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజుల

మహదేవపుర, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పచ్చదనంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే మంజుళా లింబావళి తెలిపారు. కార్తీక్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సాలుమరద తిమ్మక్క ఉద్యానవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్కుకు వచ్చేవారికి ఆహ్లాదకరమైన పచ్చదనం, పిల్లలకు సురక్షితమైన ఆటపరికరాలు, సీనియర్ సిటిజన్‌లకోసం వాకింగ్ ట్రాక్ కల్పించామన్నారు. ల్యాండ్‌స్కేపింగ్, వాక్‌పాత్, పిల్లల ప్లే ఏరియా, యోగా- వ్యాయామాలకు తగినంత స్థలం కల్పించామన్నారు. సౌరవిద్యుద్దీపాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం దొడ్డనెక్కుంది, ఫర్న్‌సిటీ, ఆశ్రయ లే అవుట్, గరుడాచార్‌పాళ్య, ఏఈసీఎస్ లే అవుట్, బెమెల్ లే అవుట్, పణత్తూరు తదితర ప్రాంతాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటస్వామిరెడ్డి, అనంత రామయ్య, జయదేవ్, మునిరాజు, భరత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల తర్వాత ఆర్థికంలో భారీ మార్పులు

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ ఆదాయం ప్రగతిపరంగా స్థిరత్వాన్ని పొందే అవకాశం ఉందని 2027లో రెండంకెల అభివృద్ధి సాధ్యం కావచ్చునని కోటక్ మహీంద్రా అస్సెట్ మేనేజిమెంట్ కంపెనీ ప్రకటించింది. ఈమేరకు బుధవారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్థ ఎండీ నీలేశ్‌షా అభిప్రాయం ప్రకారం రెండేళ్ల తర్వాత విదేశీ పెట్టుబడులు ఆకర్షణ పెరుగుతుందన్నారు. మిడ్ క్యాప్‌లు, లార్జ్, స్మాల్ క్యాప్‌లను అధిగమించే అవకాశం ఉందని అభి ప్రాయపడ్డారు. ఆర్థికసేవల ప్రగతి లాభదాయకాన్ని సుస్థిరం చేసే విభాగాలవైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతారన్నారు. వాడకం పెరిగే తరహాలోనే ఆదాయం, జీఎస్టీ సంస్కరణలతో బలమైన చైతన్యం సాధ్యం కానుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ తలసరి ఆదాయం పెరగనుందన్నారు. ఈకామర్స్ మార్కెటింగ్‌లో డిజిటల్ అమలు చేయనుందన్నారు. స్థిర ఆదాయంపట్ల ప్రగతి ఉంటుందన్నారు.

8 నుంచి హాకథాన్

చిక్కబళ్ళాపుర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హాకథాన్ ఫైనల్స్‌కు నాగార్జున ఇంజనీరింగ్ కళాశాల నోడల్ సెంటర్‌గా ఎంపికైందని ప్రిన్సిపాల్ డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 60 విద్యాసంస్థలు స్మార్ట్ ఇండియా హాకథాన్ పోటీలు సాగాయని, ఫైనల్స్‌కు తమ కళాశాల నోడల్‌సెంటర్‌గా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 8, 9 తేదీలలో నిరంతరంగా 36 గంటలపాటు హాకథాన్ ఉంటుందన్నారు. 19జట్లు పాల్గొంటాయన్నారు. హాకథాన్ పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇన్నోవేషన్ రీసెర్చ్ ప్రాబ్లెం సాల్వింగ్‌లో తమ సంస్థ అగ్రగామిగా ఉందన్నారు. జాతీయ స్థాయి కార్యక్రమంతో మరింత ప్రయోజనం చేకూరనుందన్నారు.